# వార్త టుడే

కామారెడ్డి | నిజామాబాద్

25-08-2024 శనివారం

# ప్రభుత్వోద్యోగులంటే చిన్నచూపేలా?





ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి గంజిలో ఈగల తయారైంది. ప్రభుత్వాలు మారుతున్నా, పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ ప్రభుత్వాలు మాటలకే పరిమితం అవుతున్నాయి. అటు సమాజంలో ఇటు ప్రభుత్వంలో ఉద్యోగులు రోజు రోజుకి చులకన అవుతున్నారు. కొందరు అవినీతి ఉద్యోగుల ప్రభావం, అందరూ ఉద్యోగులపై పడుతుంది. పైసలు లేనిదే పనిచేయరనే అపవాదు వస్తుంది. సామాన్య ప్రజల్లో అయితే ఉద్యోగులకేం తక్కువ, రూ.లక్షలకు లక్షల లంచాలు వస్తాయి.రోజు మస్తు సంపాదన ఉంటుంది. నెల జీతంతో పనేముందనే భావన నెలకొంటుంది.వాస్తవానికి 90% పైబడి ఉద్యోగుల జీవితాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. వచ్చిన జీతం ఇంటి ఖర్చులు, నెలవారి వాయిదాలు, అప్పుల చెల్లింపులకే సరిపోవడం లేదు. కనీస అవసరాలకు సైతం ఆలోచించాల్సిన దుస్థితి కనిపిస్తుంది. అనుకొని అవాంతరాలు, అనారోగ్య పరిస్థితులు తలెత్తితే, అప్పు చేయాల్సిన దయానీయ దుస్థితి నెలకొంటుందనడంలో సందేహం లేదు. కానీ కొందరు అవినీతి అధికారుల సంపాదన చూసి, అందరూ ఉద్యోగులు అవినీతిపరులేనన్న భావన సాధారణ ప్రజల్లో కలగడం విచారకరమే మరి.జీవితాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. వచ్చిన జీతం ఇంటి ఖర్చులు, నెలవారి వాయిదాలు, అప్పుల చెల్లింపులకే సరిపోవడం లేదు. కనీస అవసరాలకు సైతం ఆలోచించాల్సిన దుస్థితి కనిపిస్తుంది. అనుకొని అవాంతరాలు, అనారోగ్య పరిస్థితులు తలెత్తితే, అప్పు చేయాల్సిన దయానీయ దుస్థితి నెలకొంటుందనడంలో సందేహం లేదు. కానీ కొందరు అవినీతి అధికారుల సంపాదన చూసి, అందరూ ఉద్యోగులు అవినీతిపరులేనన్న భావన సాధారణ ప్రజల్లో కలగడం విచారకరమే మరి.

## అధిక పని భారంతో రోగాలు:

సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక, ఉద్యోగులపై పని భారం ఎక్కువైంది. అత్యవసర సమాచారం అందజేత పేరిట, రాష్ట్ర కార్యాలయాల నుంచి ఈమెయిల్స్ అర్ధరాత్రిల్లో వస్తున్నాయి. వెంటనే సమాచారం కావాలని ఆర్డర్స్ అందుతున్నాయి. ఉదయం రాత్రనే తేడా లేకుండా, పనిచేయాల్సి వస్తుంది. రాత్రంతా పనిచేసినా, ఉదయం ఖచ్చితంగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాల్సిందే. లేదంటే గైర్హాజరు పడినట్టే. కానీ అధిక పని గంటల పనిని ఎవరు పరిగణలోకి తీసుకోవడం లేదు. అటెండర్ నుంచి ఆఫీసర్ వరకు పని భారంతో కుదేలు అవుతున్నారు. బిపి, షుగర్, మెడ నొప్పులు, దృష్టిలోపాలు, గుండె రోగాలు, మానసిక ఒత్తిడిలు ఉద్యోగులను అనునిత్యం వెంటాడుతున్నాయి. సగటు ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరికి, ఇందులో ఏదో ఒక రోగం పలకరిస్తూనే ఉంటుంది. ఎవరికి గోడు చెప్పుకున్న లాభం లేని పరిస్థితి ఉద్యోగులది. అందుకే కక్కలేని మింగలేని దయానీయ స్థితిలోకి ఉద్యోగులు వెళ్లిపోతున్నారు.

## అన్నింటికి అనర్హులేనా:

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పక్కదారి పట్టకుండా, ప్రభుత్వ ఉద్యోగులను వీటికి అనర్హులుగా ప్రకటించడం సమంజసమే. దీన్ని ఎవ్వరూ కాదనలేరు కూడా. కానీ కొన్ని సందర్భాల్లో ఈ నియమ నిబంధనలు ప్రభుత్వోద్యోగ కుటుంబాలకు గుదిబండలా మారుతున్నాయి. ఓ ప్రభుత్వ ఉద్యోగి పెళ్లి చేసుకుని, తన భార్య పిల్లలతో వేరుగా ఉంటున్నప్పటికినీ, సదరు ఉద్యోగి తల్లిదండ్రులకు అర్హతలున్నా, పెన్షన్లు పొందలేకపోతున్నారు. ఉద్యోగి భార్యనో, భర్తనో పారిశ్రామికవేత్తలుగా ఎదగలనుకున్నా, రాయితీ పథకాలు పొందలేని నిబంధనలు అడ్డు గోడలా మారాయి. ఉద్యోగి కుటుంబంలోని పెళ్లి కాని సోదరీ సోదరులు, రాయితీ పథకాలతో లభించే స్వయం ఉపాధికి దూరం అవుతున్నారు. కారణమేంటంటే వీరి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం లభించడమే. ఫలితంగా తెల్ల రేషన్ కార్డుకు దూరం కావడమే. ఉద్యోగి సోదరా, సోదరీమణులు పెళ్లయి, సొంత కుటుంబం ఏర్పడితే తప్పా, ప్రభుత్వ పథకాలు పొందలేని దుస్థితి నెలకొంది. ఇక్కడ విలువైన సమయాన్ని, ఆర్థిక ఎదుగుదలను, నిర్దేశించుకున్న లక్ష్యాలను, వ్యాపారాభివృద్ధిని సదరు ఉద్యోగి కుటుంబ సభ్యులు సకాలంలో పొందలేకపోవడం అందరూ గమనించాల్సిన విషయం. ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలో పొందే మొత్తం జీతం, ఓ పారిశ్రామికవేత్త పొందే ఓ సబ్సిడీ కంటే చాలా తక్కువేనని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి తెలుగు ప్రభుత్వాలు సునిశిత దృష్టితో ఆలోచించి, సంక్షేమం, స్వయం ఉపాధి కల్పన, పారిశ్రామిక అభివృద్ధి విషయంలో ఉద్యోగులకు వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే తలసరి ఆదాయం పెరుగుదలలో మార్పు కనిపిస్తుంది. ఉద్యోగి కుటుంబంలో ఉత్సాహమున్న వారిని పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడానికి, ప్రభుత్వం విధివిధానాలను రూపొందించాల్సిన ఆవశ్యకత కనిపిస్తుంది. ఎలా చేస్తే అర్హులైన ఉద్యోగ కుటుంబాలకు సంక్షేమ, ఉపాధి, వ్యాపార అవకాశాలు లభిస్తాయో తేల్చేలా ఓ కమిటీ ఏర్పాటు చేసి, ఉద్యోగ కుటుంబాల్లోని అర్హులకు న్యాయం చేయాల్సిన ఆవశ్యకత కనిపిస్తుంది. తెలుగు ప్రభుత్వాలు దీనిపై ఏం చేస్తాయో చూడాలి మరి.



వ్యాసకర్త : కెంపుల నాగరాజు
జిల్లా అధ్యక్షులు
తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్
నిజామాబాద్ 9989075383



# షరతులు లేని రుణమాఫీ చేయాలని డిమాండ్

**ఆర్మూర్ పట్టణం :** షరతులు లేని రూ.2 లక్షల రుణమాఫీ అర్హులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఆర్మూర్ కార్యక్రమం ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లిలో ప్రారంభమైంది. రాజకీయ పార్టీలకు అతీతంగా చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# శ్రీవారిని దర్శించుకున్న ఇందూర్ ఎమ్మెల్యే-ధనాపాల్.



సుభాష్ నగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి వారిని శుక్రవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని భగవంతుడిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే రైతన్నలకు రూ.2లక్షల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నెరవేర్చేలా పార్టీ నాయకులు, సీఎంకు బుద్ధి ప్రసాదించాలని స్వామిని వేడుకున్నట్లు ధన్పాల్ పేర్కొన్నారు. కుటుంబసభ్యులు మణిమాల, ప్రణయ్ తదితరులు ఉన్నారు.

# 16 వరకు దరఖాస్తుకు అవకాశం




నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్టుడే: నవోదయ విద్యాలయంలో ఆరోతరగతి ప్రవేశ పరీక్షకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోడానికి సెప్టెంబరు 16వ తేదీ వరకు అవకాశముందని డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జనవరి 18న పరీక్ష ఉంటుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెబ్సైట్ www. navodaya. gov.in లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు చరవాణి నెంబర్ 9701907749లో సంప్రదించాలని సూచించారు.